నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 7 నవంబర్ 2024 | HYDERABAD

రివర్స్ స్కేటింగ్ చేస్తూ కూచిపూడి నాట్య ప్రదర్శనలో సోలో కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించిన కట్ట సమన్వితారెడ్డి '10 వరల్డ్ రికార్డు'లో చోటు సంపాదించుకున్నది. స్పందనా నృత్యకేళ వ్యవస్థాపకులు డా.నామని రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం జీడిమెట్లలో డెక్లాథాన్‌లో పది ప్రపంచ రికార్డు సంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో కట్ట సమన్వితారెడ్డి సత్తా చాటింది. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు కేవీ రమణారావు, డా. సత్యవోలు రాంబాబు, డా.ఆస్న షాహీద, డా.నామని రవికుమార్, డా.శ్రీకాంత్‌గౌడ్ రికార్డు పత్రాలను సమన్వితారెడ్డికి అందించారు. -కుత్బుల్లాపూర్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న సనత్‌నగర్‌కు చెందిన ఆకర్షణ సతీశ్ బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలుసుకున్నారు. తాను స్వయంగా సేకరించిన 9,836 పుస్తకాలతో ఇప్పటివరకు 17 గ్రంథాలయాలను నెలకొల్పిన విశేషాలను గవర్నర్‌కు వివరించారు. ఆకర్షణను అభినందించిన గవర్నర్.. చేతి గడియారంతో పాటు ఈ నెల 25న మూసాపేటలో ఆకర్షణ నెలకొల్పనున్న తన 18వ గ్రంథాలయంలో ఏర్పాటు చేసేందుకు వీలుగా కొన్ని పుస్తకాలను బహూకరించారు. -అమీర్‌పేట

అబ్బురపరుస్తున్న కళాఖండాలు | బయోడైవర్సిటీ రోడ్‌లోని ఫ్లై ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ వన్యప్రాణుల ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. నిజంగానే వన్యప్రాణులు ఇక్కడ కొలువుదీరాయ అనేలా రూపొందించిన కళాఖండాలు అబ్బురపరుస్తున్నాయి.

హైదరాబాద్.. సైబర్ డర్

12 వేలు దాటిన కేసులు

రికవరీని పక్కన పెట్టి కేసుల నమోదుకే పరిమితం.. ముందుకు సాగని దర్యాప్తులు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాల కట్టడికి చర్యలు లేకపోవడంతో ఈ తరహా మోసాల్లో హైదరాబాద్ ముందంజలో ఉంటున్నది. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని మూడు సైబర్ ఠాణాల్లో 10 నెలల్లోనే 12 వేల కేసులకుపైగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. దాదాపు ప్రతి రోజూ రూ. 4 నుంచి 5 కోట్ల వరకు బాధితులు సొమ్ము పోగొట్టుకుంటున్నారు. ప్రతి ఏటా కేసుల సంఖ్య 20 శాతం వరకు పెరుగుతూ వస్తున్నాయి. అయితే ఈ సారి మాత్రం 50 శాతం పెరిగేందుకు చేరువలో ఉన్నాయి. సైబర్ ఠాణాలతో పాటు శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్‌లోనూ సైబర్‌నేరాలు నమోదువుతున్నాయి. ఈ కేసులను కలుపుకొంటే సైబర్‌నేరాల సంఖ్య భారీగా పెరుగుతున్నది. సైబర్‌నేరాలు నమోదు చేయడం వరకే నేడు పోలీసులు పరిమితమవుతున్నారు. ఆయా కేసుల్లో రికవరీ మాత్రం అంతంత మాత్రమే ఉందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలా సైబర్‌నేరాల్లో కేసుల దర్యాప్తు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటున్నది. బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టేందుకు 1930పైనే పూర్తిగా భారం వేయాల్సి వస్తున్నది.

తగ్గని నేరాలు..

హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఇటీవల వివిధ రాష్ట్రాల్లో సైబర్‌నేరగాళ్ల కోసం గాలింపు చేపట్టి భారీ సంఖ్యలో నిందితులను అరెస్ట్ చేశారు. అయినా కూడా నేరాలు తగ్గుముఖం పట్టడం లేదు. సైబర్‌నేరాలను అదుపులో చేయడానికి వివిధ రాష్ట్రాల సైబర్‌క్రైమ్ పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నారు. దీనికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో కూడా తమ వంతు పనిచేస్తున్నది. సైబర్‌నేరాలను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ట్రై పోలీస్ కమిషనరేట్లలోని సైబర్‌క్రైమ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నేరాలను కట్టడి చేయాల్సిన అవసరమున్నా, ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఎవరికి వారే అన్న చందంగా సైబర్ క్రైమ్ విభాగం తయారయ్యిందనే ఆరోపణలు వస్తున్నాయి.

8 వేలు దాటిన కేసులు

సైబరాబాద్‌లో సైబర్‌నేరాలు ఈ ఏడాది ఇప్పటికే 8 వేలు దాటాయి. కేవలం ఒక్క కమిషనరేట్ పరిధిలోనే ఈ ఏడాది భారీ సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. అయితే ఇక్కడ రూ. 50 వేల కంటే ఎక్కువగా పోతే ఫిర్యాదులను తీసుకుంటుండగా, హైదరాబాద్‌లో లక్ష రూపాయల కంటే ఎక్కువగా నష్టపోయిన వారి ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సైబరాబాద్‌లో భారీగా కేసుల సంఖ్య పెరుగుతున్నదని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. బాధితుల అత్యాశ, భయం, అమాయకత్వంతోనే సైబర్‌నేరాల్లో ఆర్థిక నష్టం ఎక్కువగా జరుగుతున్నది. అయితే గతంలో బ్యాంకు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ, బ్యాంకు ఖాతాలు ఇవ్వకుండా కట్టడి చేయడం వంటి చర్యలకు ఉపక్రమించినా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉండడంతో జరుగుతున్న నష్టం మరింతగా పెరుగుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.

సరిపోయేంత సిబ్బంది లేక..

బాధితులు హైదరాబాద్‌లో ఉంటే.. నేరగాళ్లు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నారు. ఇక్కడ నేరం జరిగిన తరువాత బాధితుడి ఫిర్యాదు చేసిన అనంతరం కేసు నమోదు చేసుకొని, నిందితుల వివరాలు పోలీసులు సేకరిస్తారు. అయితే అప్పటికే సైబర్‌నేరగాడు తన బ్యాంకు ఖాతాల్లో బాధితులు డిపాజిట్ చేసిన సొమ్మును దోచేస్తాడు. గతంలో ట్రై పోలీస్ కమిషనరేట్లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని సైబర్ పోలీసులు కూడా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేవాళ్లు. నేడు ఆ పరిస్థితి కరువయ్యింది. సైబర్‌క్రైమ్ ఠాణాల్లో సరిపోయేంత సిబ్బంది లేకపోవడంతో సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్లలో కేసు నమోదు చేసి దానిని పక్కన పడేసి, మరో కేసుపై పోలీసులు దృష్టి సారిస్తున్నారు. ఒక కేసులు నమోదుతోనే తమ పని పూర్తయ్యిందనే భావనతో, కేసుల దర్యాప్తును పక్కన పెట్టేశారనే విమర్శలు వస్తున్నాయి.

సైబర్‌నేరాల నమోదు ■2023 ■2024

కమిషనరేట్	2023	2024(10 నెలలు)
సైబరాబాద్	5342	8000
రాచకొండ	1372	1800
హైదరాబాద్	2735	2650

హెచ్ఎండీఏ టీడీఆర్‌కు స్పందన కరువు

సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బ్యాంకుకు స్పందన కరువైంది. అందుబాటులోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. కొత్త ప్రాజెక్టులు లేక టీడీఆర్ విలువ సమకూరడం లేదు. జీహెచ్ఎంసీ తరహాలో భూ నిర్వాసితులకు సాయమందించేలా హెచ్ఎండీఏ పరిధిలో కూడా టీడీఆర్ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు హెచ్ఎండీఏ పరిధిలో కొత్త ప్రాజెక్టులు లేక ఆదరణ కరువైంది. హెచ్ఎండీఏ డిజిటలైజ్ టీడీఆర్, లెడ్జర్ వంటి సదుపాయాలతో ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ప్లాట్‌ఫాంను రూపొందించారు. హెచ్ఎండీఏ టీడీఆర్ ద్వారా భూ సేకరణలో ఆస్తులను కోల్పోయిన బాధితులకు పారదర్శకంగా పరిహారాన్ని పొందేలా, క్రయ విక్రయాలకు వీలుగా టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌ను అధికారులు రూపొందించారు. కోల్పోయిన స్థలానికి మార్కెట్ ధరకు అనుగుణంగా రెండు నుంచి నాలుగు రెట్ల వరకు టీడీఆర్‌లు పొందే వీలు ఉండగా, ఆన్‌లైన్‌లోనే భూ నిర్వాసితులు క్రయవిక్రయాలు నిర్వహించుకోవచ్చు. ఇక హెచ్ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్లన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తుండగా, కొనుగోలు చేసిన టీడీఆర్‌తో అదనపు నిర్మాణాలను చేయవచ్చు. కానీ హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు ఎలాంటి భారీ ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంతో... భూ నిర్వాసితులకు ఎలాంటి టీడీఆర్ జమ చేయలేకపోయింది. ఈ క్రమంలో అట్టహాసంగా ప్రవేశపెట్టిన టీడీఆర్ బ్యాంక్... ఆరు నెలలు గడిచినా నిద్రావస్థలోనే ఉన్నది.

ఆక్రమణల లెక్క తేల్చేలా..

హైడ్రా కార్య ప్రణాళిక

మేడ్చల్ జిల్లాలో సర్కారు భూముల పరిశీలన

మేడ్చల్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూముల పరిశీలనకు హైడ్రా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ప్రభుత్వ భూముల పరిశీలనకు సంబంధించి జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి సమాయత్తం కావాలని సమాచారం వచ్చినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ భూములు హైడ్రా అధికారులు పరిశీలించే సమయంలో తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు సంబంధించి ప్రభుత్వ భూముల వివరాలను హైడ్రా అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించగా, మిగతా ప్రభుత్వ భూముల వివరాలను హైడ్రా అధికారులకు సమర్పించారు. ఇదిలా ఉంటే సర్కారు భూముల్లో ఉన్న నిర్మాణాల వివరాల సేకరణలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు.

సర్కారు భూముల పరిశీలన

ప్రభుత్వ భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాల లెక్క తేల్చేందుకే ప్రభుత్వ భూములను హైడ్రా పరిశీలించనున్నది. మేడ్చల్ జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గతంలో లెక్కలు తేలాయి. ఇటీవలే హైడ్రా అధికారులకు సమర్పించిన నివేదికలో కూడా 5 వేల పైచిలుకు ఎకరాలు మాత్రమే ఉన్నట్లు వివరించినట్లు తెలుస్తున్నది. బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 420, దుండిగల్ మండలంలో 425, మేడిపల్లి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417, కుత్బుల్లాపూర్ మండలంలో 600, బాచుపల్లి మండలంలో 360, ఉప్పల్ మండలంలో 333, మల్కాజిగిరి మండలంలో 113, మేడ్చల్ మండలంలో 37 ఎకరాలు ఉన్నాయి.

నోటీసుల అందజేత..?

ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకే హైడ్రా భూములను పరిశీలించనున్నది. పరిశీలనలో భాగంగా ప్రభుత్వ భూముల్లో ఉన్న నిర్మాణాల లెక్కలను తేల్చనున్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారుల వద్ద ప్రభుత్వ భూముల్లో నిర్మించిన నిర్మాణాల లెక్కలు ఉన్నప్పటికీ మరోసారి హైడ్రా అధికారుల పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు నిర్మాణాలను పరిశీలించనున్నారు. గుర్తించిన నిర్మాణాలపై తదుపరి చర్యల్లో భాగంగా నోటీసులు అందిస్తారని తెలుస్తున్నది.

బల్దియాలో తనిఖీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సమయ పాలన పాటించరా?

ఉద్యోగులపై మేయర్ ఆగ్రహం

బల్దియా ప్రధాన కార్యాలయంలోని పలు విభాగాల పరిశీలన

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్, హెల్త్, వెటర్నరీ విభాగాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు సిబ్బందిని ఏ సమయానికి వస్తున్నారు? సమయ పాలన పాటిస్తున్నారా అంటూ అడిగారు. కొన్ని సెక్షన్లలో కుర్చీలన్నీ ఖాళీగా ఉండటంతో ఇంకా ఆఫీస్‌కు రాలేదా అంటూ.. పక్క సీట్లో ఉన్న వారిని అడుగ్గా, టిఫిన్ చేయడానికి వెళ్లారు అనడంతో సమయ పాలన పాటించాలన్నారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి.. ఆలస్యం వచ్చిన వారిపై ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక పంపాలని అన్ని విభాగాలకు సర్క్యులర్ పంపించారు. కాగా, హెల్త్ సెక్షన్‌లో కొందరు పని పక్కన పెట్టి సెల్ ఫోన్ చూస్తుండడంతో మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి సీఎంఅండ్‌హెచ్ఓ ఏ సమయానికి వస్తున్నారని.. సిబ్బందిని అడగడంతో జేసీ శానిటేషన్ జోక్యం చేసుకొని ముషీరాబాద్ సర్కిల్‌లో ఏఎంఅండ్‌హెచ్ఓగా పని చేస్తున్నందున అక్కడ పని పూర్తి చేసుకొని మధ్యాహ్నం వరకు ఇక్కడకు వస్తున్నారని మేయర్‌కు తెలిపారు. రావడానికి ఒక సమయం అంటూ లేదా అని ప్రశ్నించడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు హెడ్ ఆఫీసుకు వస్తారని జేసీ వేణుగోపాల్ రెడ్డి వివరణ ఇచ్చారు. కాగా, ఆయా విభాగాల సిబ్బంది ఉదయం 10:30 వరకు రావాలని, గ్రేస్ టైం మరో 10 నిమిషాలు ఉంటుందని, 10:40 నిమిషాల వరకు ఆఫీస్‌కు రాని సిబ్బందికి ఒక మాసంలో మూడు లేట్‌లకు ఒక క్యాజువల్ లీవ్ కట్ చేస్తామన్నారు. క్యాజువల్ లీవ్ లేనట్లైతే ఈఎల్ కట్ చేస్తామన్నారు. కాగా, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు ప్రక్రియలో నమోదు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. వివిధ విభాగాల్లో ఆకస్మిక తనిఖీల అనంతరం విభాగాల అదనపు కమిషనర్లు, హెచ్ఓడీలతో సమీక్ష జరిపారు.

మొక్కుబడిగా ఏఆర్‌టీ

వైద్యుల నియామకాల ప్రక్రియ స్థానిక దవాఖానలకు..

నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు

బాధ్యతలు విస్మరిస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ

సిటీబ్యూరో: హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు సంబంధించిన చికిత్సా కేంద్రాలైన ఏఆర్‌టీ సెంటర్లను ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ గాలికొదిలేసింది. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్వహిస్తున్న ఏఆర్‌టీ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సిన ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆయా దవాఖానలు, ఎన్‌జీవోలకు అప్పజెప్పి మొక్కుబడి బాధ్యతలు నిర్వర్తిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

5 చోట్ల ఏఆర్‌టీ సెంటర్లు

ప్రస్తుతం నగరంలో 5చోట్ల ఏఆర్‌టీ సెంటర్లు రోగులకు చికిత్స అందిస్తున్నాయి. అందులో ఎర్రగడ్డ ఛాతీ దవాఖాన, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, కింగ్‌కోఠి జిల్లా దవాఖానల్లో ఈ సెంటర్లను నిర్వహిస్తున్నారు. కింగ్‌కోఠి దవాఖాన మినహా మిగిలిన నాలుగు దవాఖానల్లో ఉన్న ప్రతి ఏఆర్‌టీ సెంటర్‌కు ముగ్గురు వైద్యులు ఉండాలి. కానీ గత కొన్ని రోజులుగా అక్కడ పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఇటీవలే వైద్యుల నియామకానికి సంబంధించి ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు చర్యలు చేపట్టింది. దీంతో రెండు రోజుల కిందట ఉస్మానియా దవాఖానలో ఏఆర్‌టీ వైద్యుల నియామకానికి సంబంధించిన ప్రక్రియను టీ సాక్స్ అధికారులు ప్రారంభించారు. ఈ ప్రక్రియలో కొందరు టీసాక్స్ అధికారులు పాల్గొన్నప్పటికీ నియామక ప్రక్రియ మొత్తం ఆయా సెంటర్ల నోడల్ అధికారులు, సూపరింటెండెంట్ల చొరవతోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోగుల అవస్థలు

ప్రతి రోజూ 300 మంది ఓపీ ఉండే ఉస్మానియా ఏఆర్‌టీ సెంటర్‌లో కేవలం నెల వారీ ఏఆర్‌టీ మందులు తీసుకునేందుకే మూడు గంటల సమయం పడుతున్నదని రోగులు చెబుతున్నారు. సెంటర్‌లో ఓపీ సమయం ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఉన్నా అక్కడి సిబ్బంది ఒంటి గంట లోపే రావాలని హుకూం జారీ చేయడంతో 9 నుంచి 12 గంటల సమయంలోనే రోగులు పెద్ద సంఖ్యలో రావడంతో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్దే గంట సమయం పడుతున్నదని, అక్కడి నుంచి కౌన్సిలర్ వద్దకు వెళ్లేందుకు దాదాపు మరో గంట నిరీక్షించాల్సి వస్తున్నదని, ఆ తరువాత ఏదైనా సమస్య కోసం వైద్యుల వద్దకు వెళ్తే వారు చికిత్స అందించకుండా జనరల్ ఓపీకి వెళ్లి చూయించుకోమని చెప్పడం, అప్పటికే అక్కడ ఓపీ సమయం మించిపోవడంతో చేసేది లేక వెనుతిరిగి పోవాల్సి వస్తున్నదని రోగులు బోరుమంటున్నారు.



తప్పని ఇబ్బందులు

ఏఆర్‌టీ సెంటర్లలో వైద్యులను నియమించాల్సిన తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆ బాధ్యతలను ఆయా దవాఖానలకు అప్పగించింది. దీంతో కొన్ని సెంటర్లలో ఆయా దవాఖానల అధికారులు అవగాహన లేని వైద్యులను నియమిస్తుండగా, మరికొన్ని సెంటర్లలో కొందరు అధికారులు ఆ పోస్టులను తమకు నచ్చినవారికి కట్టబెడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని పలు ఏఆర్‌టీ సెంటర్లలో అక్కడి వైద్యులు చికిత్స అందించకుండా రోగులను జనరల్ ఓపీలో చూపించుకోవాలని పంపిస్తున్నట్లు బాధిత రోగులు ఆరోపిస్తున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల కోసం ఏఆర్‌టీ సెంటర్లలోనే ప్రత్యేక ఓపీ ఉంటుంది. అక్కడకు వచ్చే రోగులను ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు పరిశీలించి అవసరమైన చికిత్స అందించాలి. అవసరమైన వైద్యపరీక్షలు, మందులను ప్రిస్క్రిప్షన్‌లో రాసి ఇవ్వాలి. ఏవైన దీర్ఘకాలిక, లేదా ఇతర స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సంబంధిత చికిత్స అవసరమున్న రోగులను మాత్రం సంబంధిత విభాగాలకు రెఫర్ చేయాలి. కానీ ఉస్మానియా వంటి సెంటర్లలో అలా జరగడం లేదు.

వైద్యులతో డేటా రిపోర్టింగ్ పని..

వైద్యులకు ఏఆర్‌టీ సెంటర్‌కు సంబంధించిన డేటా రిపోర్టింగ్ పని, దవాఖానల్లో జరిగే భవన నిర్మాణ పర్యవేక్షణ వంటి పనులను అప్పగించడంతో వారు రోగులకు అందుబాటులో ఉండలేకపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ సుమారు 300 వరకు ఓపీకి వచ్చే ఉస్మానియా ఏఆర్‌టీ సెంటర్‌కు ముగ్గురు వైద్యులు ఉండాలి. కానీ మొన్నటి వరకు ఉన్న ఒక్కరిద్దరు వైద్యులకు కూడా డేటా రిపోర్టింగ్, కన్‌స్ట్రక్షన్ వర్క్స్ వంటివి అప్పగించడంతో వారు రోగుల చికిత్సపై దృష్టి పెట్టలేకపోతున్నట్లు రోగులు వాపోతున్నారు.

నియామక ప్రక్రియ..

కొన్ని సెంటర్లలో సంబంధిత అధికారులు సరైన అవగాహన లేని వైద్యులను నియమించడం, నియామకాల్లో అవకతవకలకు పాల్పడటంతో ఏఆర్‌టీ సెంటర్లకు వచ్చే వైద్యులు రోగుల సమస్యలను అర్థం చేసుకోలేక చేతులెత్తేయడం లేదా ప్రతి చిన్న సమస్యకు రోగులను జనరల్ ఓపీకి రెఫర్ చేయడం జరుగుతున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఏఆర్‌టీ సెంటర్లలో అనుభవం, అవగాహన ఉన్న వైద్యులను నియమించాలని, నియామక ప్రక్రియ మొత్తం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీనే చేపట్టాలని రోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సర్వేపై అపోహలొద్దు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కోరారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. సర్వేకు ఆటంకాలు కల్పిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి మంత్రి పొన్నం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 17 లక్షల 44వేల ఇండ్లు సర్వే చేయడానికి 88వేల ఎన్యూమరేటర్లను నియమించినట్లు చెప్పారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇండ్లు కేటాయించినట్లు చెప్పారు. గ్రేటర్‌లో 29,58,277 ఇండ్ల సర్వేకు 20,920 మంది ఎన్యూమరేటర్లను, 1728 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు మంత్రి పొన్నం తెలిపారు. అనంతరం ఎన్యుమరేటర్లకు సర్వేకు సంబంధించిన సామగ్రి కిట్‌లను మంత్రి, అధికారులు పంపిణీ చేశారు. కుటుంబసర్వేకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.